క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

తెర్లాం: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉన్న ఆవరణలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్భాపు లూర్థు పాల్గొనే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, లబ్ధిదారులు, వీఓఏలు హాజరు కావాలని కోరారు.

మెంటాడ: మండల కేంద్రంలో మంగళవారం జరిగే వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర హాజరవుతున్నారని, లబ్ధిదారులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పిల్లల ఆరోగ్యంపై సూచనలిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి

తెర్లాం: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీక్షితారాణి సూచించారు. సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లోని ప్రీ-స్కూల్ పిల్లలకు ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన ఆమె ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పిల్లలకు తినబెట్టాలని తెలిపారు. పౌష్టికాహారం ద్వారానే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. చిన్నారులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేసి ఎత్తు, బరువు పెరుగుతున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

30న శ్రీరామనవమి వేడుకలు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలోని సీతారామ ఆలయంలో ఈ నెల 30వ తేదీన శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రావు రవీంద్ర, ఆలయ అర్చకులు భోగాపురపు ప్రసాదరావు శర్మ సోమవారం తెలిపారు. 16వ శతాబ్ద కాలం నాటి బొబ్బిలి రాజులు నిర్మించిన ఈ ఆలయంలో జరిగే వేడుకల్లో భాగంగా చేసే సీతారాముల కల్యాణోత్సవం తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు పోటీపడతారు. అదేరోజు మద్రాసు మైత్రి సెంట్రల్ ఆర్ట్స్ కళాబృందంతో భరతనాట్యం ప్రదర్శన కూడా ఉంటుందన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

బొబ్బిలి రూరల్: ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలకు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పి.శంకరరావు కోరారు. ఇదే విషయమై సోమవారం మండలంలోని ఎం.బూర్జవలస గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ బిల్లుల భారంతో పరిశ్రమలు మూతపడ్డాయని, దీంతో పరిశ్రమల్లో పనిచేసే వారంతా ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని పరిశ్రమలు మూతపడకుండా విద్యుత్ చార్జీలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలం, శంకరరావు పాల్గొన్నారు.

రోజుకు రూ.257 వేతనం

రేగిడి: గ్రామాల్లోనే చక్కగా ఉపాధి పనులు చేసుకుంటే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందని ఏపీఓ ఎస్.హరనాథరావు తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నయ్యపేట గ్రామంలో అవుటువాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన జాబ్‌కార్డు ఉన్నవారినే పనులకు అనుమతించాలని సిబ్బందికి తెలిపారు. పనిచేసిన వారికే మస్తరు వేయాలని, నిర్దేశిత కొలతల్లో రెండు పూటలా పనులు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు.

జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా 'కొత్తా'



సాయిప్రశాంత్ కుమార్

రాజాం: విజయనగరం జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు డీఆర్‌ఓ ఆర్.గణపతిరావు ప్రకటించారని జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ సోమవారం వెల్లడించారు. రాజాంతో పాటు మండల పరిసర ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ తరఫున భారీ స్థాయిలో రక్తదాన శిబిరాలు, వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో ఆయనకు ఈ అరుదైన అవకాశం దక్కినట్లు తెలిపారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో జరిగిన కుక్కలదాడిలో వృద్ధుడు సీర సత్యంకు గాయాలయ్యాయి. ఇంటి నుంచి రోడ్డు వైపు వెళ్తుండగా, వీధిలోని కుక్కలు ఆయనపై దాడి చేసి, గాయపరిచాయి. అతడి కాలికి తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళలకు అండగా వైఎస్సార్ ఆసరా

- వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి రూరల్:

మహిళలకు అండగా వైఎస్సార్ ఆసరా పథకం నిలుస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తొలుత మండలంలోని డ్వాక్రా గ్రూపుల సభ్యులందరికీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన చెక్కును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని, మహిళల ఆర్థిక ప్రగతికి అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలు మహిళల ఆర్థిక ఎదుగుదల, స్వయంఉపాధి సాధనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాల వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర, ప్రజా సంకల్పయాత్ర, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటినీ నెరవేరుస్తున్నారని, ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

మండలానికి రూ.8.02 కోట్లు..

ప్రస్తుతం వైఎస్సార్ పథకం ద్వారా మండలంలోని మొత్తం 1352 గ్రూపుల్లోని 14,678 మంది సభ్యులకు రూ.8.02 కోట్లు అందిస్తుండగా, ఒక్క బొబ్బిలి మున్సిపాలిటీలోని 958 గ్రూపుల 10,018 మంది సభ్యులకు రూ.5.76 కోట్లు అందుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలు నెరవేర్చలేదని, ఇప్పుడు మన సీఎం జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారన్నారు. మరోసారి చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, మళ్లీ మళ్లీ సీఎం జగన్‌నే ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా థ్యాంక్యూ సీఎం జగనన్న అని మహిళలు నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.మురళీకృష్ణ, ఎంపీపీ ఎస్.లక్ష్మి, బుడా చైర్‌పర్సన్ ఐ.పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతికుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఐ.గోపాలరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఏపీఎం పీఏ స్వామి మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎస్.రాజారావు, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి..



రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చే దైవం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. 2024 ఎన్నికల్లోనూ ఆయనే మళ్లీ సీఎం కావాలి. ప్రస్తుతం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు అందిస్తున్న ఆర్థికసాయం మరువలేనిది. ప్రతీ మహిళ స్వయంఉపాధి సాధించడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

–ఎస్.వనజాక్షి, శివడవలస గ్రామం.

మా గ్రూపునకు రూ.3 లక్షలు..



మా గ్రూపులో పది మంది సభ్యులం ఉన్నాం. మా అందరికీ వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.3 లక్షలు అందింది. నాకు రూ.30 వేల వరకు వచ్చింది. మహిళల ఆర్థిక ప్రగతికి సీఎం జగనన్న ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆయనకు మేమెంతో రుణపడి ఉంటాం. అన్ని వర్గాలను ఆర్థికంగా ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ. ఇదే ప్రభుత్వం మాకు మళ్లీ మళ్లీ కావాలి.

–శంబంగి భారతి, పక్కి గ్రామం.

పథకాలతో సంఘాలు బలోపేతం..



ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో మహిళా సంఘాలు బలోపేతమయ్యాయి. వైఎస్సార్‌సీపీ మహిళా పక్షపాతి ప్రభుత్వం, సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

–పెంకి రామలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఎ.వెలగవలస గ్రామం

ప్రభుత్వ భవనాలు ప్రారంభించిన మంత్రి బొత్స



రిబ్బన్ కట్ చేసి, తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యన్నారాయణ

వంగర: మండల కేంద్రంలో నిర్మించిన పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలను మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిమిత్తం మండలానికి విచ్చేసిన ఆయన రూ.కోటి వ్యయంతో కొత్తగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం భవనంతో పాటు రూ.15 లక్షలతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ గొడౌన్, రూ.12.50 లక్షలతో నిర్మించిన కోల్డ్ స్టోరేజీ భవనాలను రిబ్బన్ కట్ చేసి, మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కలెక్టర్ సూర్యకుమారి, రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరాడ తిలక్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురం జగన్‌మోహనరావు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ కరణం రాధమ్మ, ఆర్‌డీఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరాతీస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

వంగర: వైఎస్సార్ మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం నిమిత్తం మండల కేంద్రానికి సోమవారం విచ్చేసిన కలెక్టర్ ఎ.సూర్యకుమారి సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. ఉద్యోగుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం వేగవంతం చేయాలని, జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు.

కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ సోమవారం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి చేతులమీదుగా విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని, ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కంటివైద్య నిపుణు లు ఎల్.ఎల్.ఎన్.మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతికుమారి, మున్సిపల్ చైర్మన్ ఎస్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలి



ఎంపీడీఓ త్రివిక్రమరావు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ నాయుడుబాబు

మెంటాడ: జగనన్న కాలనీల్లో ఏప్రిల్ 14వ తేదీన జరిగే సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశమైన ఆయన మొత్తం 984 గృహ నిర్మాణాల పూర్తి లక్ష్యం కాగా, ఇప్పటివరకు 808 నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మిగతా నిర్మాణాలను కూడా లబ్ధిదారులతో వేగవంతం చేయించాలని, వారికి అవసరమైన నిర్మాణ సామగ్రి సకాలంలో అందించాలని సూచించారు. అలాగే పనిదినాల్లో సచివాలయం మూసివేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇదిలా ఉండగా, కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ప్రారంభించిన వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవ లైవ్ ప్రోగ్రాంకి హాజరు కావాలని తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పిట్టాడ సర్పంచ్ కాపారపు నాయుడుబాబు ఎంపీడీఓ త్రివిక్రమరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన సదరు అధికారి సంబంధిత ఏపీఎం, స్థానిక బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే పరామర్శ



భాస్కరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్‌ఓ ఇనుమల భాస్కరరావును ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు, పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి ఇనుమల రాములమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సదరు నేతలు సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, రాములమ్మ మృతికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీకృష్ణ, సీతాపతి, భానోజీరావు, సర్పంచ్ ఇనుమల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆనందరావు మృతి కళారంగానికి తీరనిలోటు

రాజాం సిటీ: మిథునం చిత్ర నిర్మాత ముయిద ఆనందరావు మృతి కళారంగానికి, కళాకారులకు తీరని లోటని పద్మశ్రీ యడ్ల గోపాలరావు, టౌన్ సీఐ కె.రవికుమార్‌లు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని, సోమవారం స్థానిక బస్టాండ్ ఆవరణలోని కళాసాగర్ వద్ద పలు స్వచ్ఛంద సేవాసంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, కళాకారుల ఆధ్వర్యంలో ఆనందరావు సంతాప సభ నిర్వహించి, ఆయనకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాకారుల ఉన్నతికి కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఏఎంఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో కళాసాగర్ అధ్యక్షుడు ఎం.దామోదరరావు, ఎం.మల్లికార్జునరావు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



రాజాం: స్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



తెర్లాం: అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించి, పరిశీలించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలం నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు గ్రామాల్లోనే ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏ శాఖకు సంబంధించిన సమస్యపై అయినా జిల్లా కేంద్రంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేస్తే మండలానికే అది వస్తుందన్న ప్రజలకు తెలియజేయాలన్నారు.

రాజాం: స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పలువురు సమర్పించిన అర్జీలను స్వీకరించి, పరిశీలించిన ఆయన ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో సమీక్షించిన ఎంపీడీఓ గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలని, ఉపాధి హామీ పనులు పక్కాగా చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ వివిధ శాఖల అధికారులతో సోమవారం సమావేశమై, స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, సేవలందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహులకు రాజకీయ భవిష్యత్ ఉండదు..

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఆలయ సందర్శనానంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచి, అదే పార్టీకి నమ్మక ద్రోహం చేసిన వారి రాజకీయ భవిష్యత్ భూస్థాపితం కావడం ఖాయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన ఈశాన్యేశ్వరాలయ ఆలయ ప్రారంభోత్సవాలకు సోమవారం హాజరైన ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మీడియాతో కాసేపు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన పార్టీని మోసం చేసిన వారు ఎవరైనా చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. పార్టీ గుర్తుతో గెలిచి, మంత్రి పదవుల కోసమో, డబ్బు కోసమో పార్టీ మారిన వారు ఇప్పుడు నియోజకవర్గ ప్రజల విశ్వాసం కోల్పోయిన పరిస్థితి ఉందన్నారు. గతంలో ఇదే నియోజకవర్గంలో ఇలానే ఆయనను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేసిన నాయకుడు ఇప్పుడు ప్రజలకు తన ముఖం చూపలేకపోతున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఇలాంటి వారిని ప్రజలు ఉపేక్షించరన్నారు. 40 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు ఇదేనా ఆయన రాజకీయ చరిత్ర అని మండిపడ్డారు. ప్రజలను నమ్మక ద్రోహం చేయడం, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అన్నా రు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్ సింహాచలంనాయుడు, కె.చంద్రశేఖర్, డి.పైడిరాజు, సీహెచ్ లక్ష్మణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, అందరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఈశాన్యేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి సోమవారం హాజరైన ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలు బాగుండాలని స్వామిని వేడుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ రామారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నవదుర్గ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయ హుండీలో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని ఈ నెల 29వ తేదీన లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ పి.శ్యామలరావు సోమవారం తెలిపారు. విజయనగరం దేవదాయ విభాగం ఇన్‌స్పెక్టర్ సమక్షంలో హుండీలు తెరిచి, ఆదాయం లెక్కిస్తామని, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

బొబ్బిలి రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ రూరల్ పీఓ విజయలక్ష్మి పర్యవేక్షణలో సోమవారం చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పౌష్టికాహార ప్రదర్శనను తిలకించి, అంగన్‌వాడీ కార్యకర్తలను అభినందించారు. కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని కోరారు.

ఆక్రమణలపై ఆర్‌డీఓకు ఫిర్యాదు

బొబ్బిలి: రామభద్రపురం మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని, దీనిపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం నాయకులు పి.శంకరరావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.గోపాలం, ధనుంజయ్ కోరుతున్నారు. ఇదే విషయమై వీరంతా ఆర్‌డీఓ పి.శేషశైలజను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు.

మరోసారి ఆశీల వేలంపాట వాయిదా

- నేడు మళ్లీ వేలంపాట: మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు



ఆశీల వేలంలో పాల్గొన్న పాటదారులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో 2023–24 ఏడాదికి సంబంధించి, జరగాల్సిన ఆశీల వేలంపాట మరోసారి వాయిదా పడింది. తొలిసారి ఈ నెల 23వ తేదీన నిర్వహించిన వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన విషయం తెలిసిందే. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు వేలంపాట నిర్వహించగా, పాటదారులంతా పలు ప్రతిపాదనలు చేశారు. ఇసుక లారీల నుంచి ఆశీల వసూళ్లకు అధికారులే చొరవ చూపాలని, లేకుంటే ఆశీల వేలంపాట మొత్తాన్ని కుదించాలని కోరారు. ఇది తమ పరిధిలో లేదని, అధికారులు నిర్ణయించిన రూ.38 లక్షల మొత్తాన్ని కంటే అధిక మొత్తంలో వేలం దక్కించుకున్న వారికే ఆశీల వేలం హక్కులు దక్కుతాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఇందుకు పాటదారులు కూడా అంగీకరించకపోవడంతో వేలంపాట వాయిదా వేశామని కమిషనర్ తెలిపారు. ఈ నెల 28వ తేదీన మళ్లీ వేలంపాట నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని విజయరాంపురం గ్రామంలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్‌ను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలోనే భూ సరిహద్దుల గుర్తింపు చేపట్టాలని, అలా చేస్తేనే మరోసారి రైతుల మధ్య భూ తగాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. సరిహద్దుల గుర్తింపు సమయంలో రైతుల నుంచి వారి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ వెంకటరమణ ఉన్నారు.

దివ్యాంగురాలికి మోటార్ సైకిల్ అందజేత



మోటార్ సైకిల్ అందిస్తున్న సర్పంచ్ పల్గుణరావు

తెర్లాం: మండలంలోని వెలగవలసకు చెందిన దివ్యాంగురాలు రాగోలు నీలవేణికి సర్పంచ్ చేపేన పల్గుణరావు చేతులమీదుగా సోమవారం మోటార్ సైకిల్ అందజేశారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని, ఇంటికే పరిమితమైన ఆమె కష్టాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా, ప్రభుత్వం ఆమెకు ట్రై మోటార్ సైకిల్ మంజూరు చేసిందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపింది.

300 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రేగిడి: మండలంలోని మునకలవలస గ్రామంలో పశువైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. పశువైద్యాధికారి వి.రాము పర్యవేక్షణలో సిబ్బంది దాదాపు 300 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పాటు మరికొన్ని వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చంద్రశేఖరరావు, రాజాం జీఎంఆర్ ఐటీ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.